# వదినా ఒక ఆడపడుచే

- కృష్ణ నివేదిత

"ఏమిటండీ మరీ చిత్రంగా మాట్లాడతారు. మీ చెల్లెలు మూడేళ్ల కొచ్చిం దని వెయ్యి రూపాయలు పెట్టి చీరెక్కడ కొనివ్వగలం. మనకున్న దాంట్లోనే ఒక చీర, రవిక తెచ్చి పెడదాం'' అన్న భార్య మాటలకు.

"అది కాదు వసంతా... రాధికేమైనా ప్రతి పండుగకు వస్తుందా ఏమిటి? వచ్చి కూడా రెండేళ్లు దాటింది. మనకా డబ్బు సర్దుబాటు కాని ఇబ్బందులేం లేవు. వెయ్యి రూపాయలిస్తే ఏం పోయింది. పైగా తానే పిల్లలిద్దరికీ ఏదో గిఫ్టుల క్రింద తెచ్చిందాయే'' అన్నాడు రాజారాం.

రాజారాం అరగంట నుంచి భార్యతో పోరుతున్నాడు. ఆరు రోజుల క్రితం ఆఖరు చెల్లెలు మద్రాసు నుంచి వచ్చింది. ఆమె రెండు రోజుల్లో వెళ్లిపోతానని చెప్పింది.

పండుగకు వచ్చిన చెల్లెలికి వెయ్యి రూపాయలతో చీర కొనివ్వాలని, అసలతనికి చెల్లెలికి, బావగార్కి బట్టలు కొని ఇవ్వాలనుంది. చెల్లెలు రాధిక ఎప్పుడో కానీ రాదు. ఏ పండగకి రావటం లేదని రాజారాం నిష్ఠూరంగా ఉత్తరం రాసే సరికి రాధికని పంపాడామె భర్త.

ఎప్పుడో కానీ రాని చెల్లెల్ని అపురూపంగా చూసి బట్టలు పెట్టి పంపాలనుకుంటుంటే భార్య దాన్ని పడనిచ్చేటట్టు లేదు.

"ఆ... ఏం తెచ్చిందిలెండి. పాతికో.. పరకో పెట్టి ఫుట్‌పాత్ మీద కొన్న పర్సు నాకునూ, బాబిగాడి కేమో జర్కిను. అదైనా ఎంత గీచి గీచి బేరమాడి ఉంటుందో నాకు తెలియదా! మీకేమీ తేనే లేదాయే... అయ్యో మూడేళ్లయింది అన్నగారింటికి వెళ్లి ఇంత విలువలేని వస్తువులు ఎలా పట్టికెళ్లనూ అనైనా అనుకోలేదు కాబోలు...'' సాగదీసింది వసంత.

"దాని ఇబ్బందులు దానివి. అత్తమామలతో, ఆడబిడ్డలతో దాని సంసారం ఎంత పెద్దదో మనకు తెలియదా వసంతా! ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారన్నమాటే గానీ ఆ మద్రాస్ పట్నంలో ఏ మూలకవి.

అయినా సరే మన కోసం అది ఆమాత్రం డబ్బు వెచ్చించి తేవటమే గొప్ప. ఈ ప్రయాణం పేరుతో దానికి ఏడెనిమిది వందలు అయ్యి ఉంటాయి కదా'' నచ్చచెప్పటాన్కి ప్రయత్నించాడు రాజారాం.

"అయివుంటే ఖర్చు చేసిందంతా ఇస్తారా ఏమిటి? ఇంకా ఫస్టు తారీఖు రావటానికి వారం రోజులు గడవాలి. పిల్లల జీతాలు, ఇంటి అద్దె, పాలు, కిరాణా మన ఖర్చులకి మాత్రం జీతం సరిపోతుందా! మనకిక్కడేం ధనరాసులు మూల్గటం లేదు. అయినా పెట్టొద్దు అనటం లేదుగా. మనకు కలిగిన దాంట్లో పెడదాం అంటున్నాగా'' విసుగ్గా అనేసి అక్కణ్నించి లేచి వెళ్లిపోయింది వసంత ఇంక వాదించటం అనవసరం అన్నట్లు.

తల పట్టుకున్నాడు రాజారాం.

'ఏం ఆడవాళ్లో ఏమిటో అర్థం కారు. రెండు నెలల క్రితం అక్కగారమ్మాయి పెళ్లి అంటూ వేలకు వేలు పోసి చీరలు కొనుక్కుంది. వారం రోజుల క్రితం ఆ వధూవరులనిద్దర్ని తీసుకొచ్చి వెయ్యిన్నర పెట్టి బట్టలు పెట్టింది. పెళ్లికి పెళ్లికీ వదిలించింది. ఇప్పుడు ఆడపడుచు వస్తే ఖర్చులు, కలిగుండటాలు గురించి మాట్లాడుతుంది. ఏం తెచ్చిందిలే మహా అంటుంది.'

వారం రోజుల క్రితం లేని పిల్లల ఫీజులు, ఇంటి అద్దె ఇప్పుడెలా వచ్చాయో మరి.

అర్థం కాలేదు రాజారాంకి.

మూడోనాడు రాధిక ప్రయాణమవుతుంటే కాళ్లకు పసుపు రాసి బొట్టు పెట్టి చీర, రవిక ఆడపడుచు చేతికిచ్చి "ఈ మధ్య కాలంలో నువ్వు రానే లేదు అని ఎనిమిదొందలైనా పెట్టి చీర పెట్టాలని మీ అన్నయ్య చాలా అనుకున్నారు. సమయానికి డబ్బు చేతి కందలేదు. అందులోనూ ఈ నెలలో ఖర్చులొకటి అధికంగా ఉన్నాయి. పేరుకి పదివేల జీతమే కానీ చేతికొచ్చే దెంత. అదైనా ఈ రోజుల్లో ఏ మూలకని అవి. మరోసారి పెడదాం లెండి మీరు బాధపడకండి అన్నాక మీ అన్నయ్య కుదుటపడ్డారు'' అంటూ సన్నాయి నొక్కులు నొక్కింది వసంత.

భార్య సన్నాయి నొక్కుల్ని చూస్తూ మౌనం వహించాడు రాజారాం.

వదిన గారు ఇచ్చిన చీర రవిక అభిమానంగా అందుకుంటూ-

"అయినా ఇప్పుడెందుకొదినా చీరలవీను, చూసి చాలా రోజులైందని వచ్చాను గానీ. మీ అందరి మధ్య ఈ నాలుగు రోజులూ గడపటమే చాలు నాకు'' అని వంగి వదినగారి కాళ్లకు నమస్కరించింది రాధిక.

చెల్లెలి చేతిలో చీర చూడగానే రాజారాం మనస్సు చివుక్కుమంది.

మహా అయితే మూడొందల రూపాయలుంటుందా చీర. దాన్నే ఆనందంగా తీసుకుని అపురూపంగా కట్టుకొచ్చిన చెల్లెల్ని చూస్తే జాలివేసిందతనికి.

చీర కట్టుకొచ్చి అన్న కాళ్లకు నమస్కరించింది రాధిక.

"అత్తా ఆటో వచ్చింది'' అంటూ వచ్చాడు బాబీ.

రాధిక సూట్‌కేస్, బ్యాగ్ ఆటోలో పెట్టారు పాప, బాబీను. వదినతో, పిల్లలతో చెప్పి ఆటో ఎక్కింది రాధిక. ట్రైన్ ఎక్కించి వస్తానని భార్యతో చెప్పి చెల్లెలితో ఆటో ఎక్కాడు రాజారాం.

స్టేషన్‌కి వెళ్లే దారిలో ఆటో ఆపించి స్వీట్లు, పళ్లు, పూలు కొన్నాడు రాజారాం చెల్లెలి కోసం.

ట్రైన్ కరెక్ట్ టైంకే వచ్చింది.

రాధిక సీటు చూసుకుని కూర్చున్నాక

"బావగారు కూడా వస్తే బాగుండేదమ్మా'' అంటూ పర్సులో నుండి రెండు వేల రూపాయలు తీసి రాధికకిస్తూ

"బావగార్ని బట్టలు కొనుక్కోమను రాధిక అలాగే నువ్వు కూడా పుట్టిన రోజుకి ఒక చీర తీసుకో'' అన్నాడు రాజారాం.

"ఎందుకన్నయ్యా నాకు చీర పెట్టావు బావుంది. ఆయనకీ ఎందుకు మళ్లీ...పైగా నాకింకో చీరా ...ఇదే ఎక్కువ'' వారిస్తూ అంది రాధిక.

"అదేమిటి రాధిక బావగారు వస్తే బట్టలు పెట్టమా ఏమిటి.. రాకపోతే మాత్రం పెళ్లయ్యాక మీరు వచ్చిందే తక్కువ'' అంటూ బలవంతాన చెల్లెలి చేతిలో పెట్టాడు సొమ్ముని రాజారాం.

రాధిక ఇక కాదనలేకపోయింది.

ట్రైన్ కదిలేవరకూ ఉండి బయటకొచ్చాడు రాజారాం.

చెల్లెలికి తాననుకున్నట్లుగా బట్టలకు డబ్బు ఇవ్వ గలిగానన్న సంతృప్తి మిగిలిందతనికి.

చెల్లెలికి డబ్బు ఇచ్చినట్టుగా భార్యకు తెలియని వ్వకూడదన్న నిర్ణయమూ మిగిలింది.

★★★

"ఈ చీరెప్పుడు కొనుకున్నావొదినా బాగుంది"


చాకలి తెచ్చిన చీరల్ని బీరువాలో సర్దుకుం టున్న వదినతో పై అరలో ఉన్న కొత్త చీరను చూపిస్తూ అడిగింది వసంత.


"గొర్రెతోక బెత్తెడు అన్నట్లు కొనుక్కోవటం కూడానా మీ అన్న సంపాదనతో. ఆ మధ్య మా అక్కయ్య వాళ్లింటికి వెళ్తే నాలుగొందలి చ్చింది. దాంట్లో మరో రెండొందలు వేసి కొన్నాను. ఆ రెండొందలు కూడా పక్కింటా విడ దగ్గర అప్పే" అంది వసంత వదిన సరళ సాగదీసి తాను చీర కొన్న వైనం చెబుతూ.

వసంతకి ఒంటికి కారం రాసుకున్నట్లయింది.

అన్న సంపాదన తానెరుగనిదేం గాదు. వకీలుగా రెండు చేతులా ఆర్జిస్తున్నాడు.


పైగా ఏడాదికి నలభై ఏభై కాటాల ధాన్యం చేతి కొస్తుంది. పెసలు, మినుములు పంట సరేసరి. ఎంత లేదన్నా ప్రతీ శ్రావణ శుక్రవారానికి రెండు కాసుల బంగారం కొంటాడు అన్నయ్య. రెండు నెలలకొక సారి వెంకటగిరి నుండి చీరలు తెచ్చే వ్యాపారి దగ్గర కనీసం రెండు చీరలన్నా కొంటుందని తల్లి నిన్న మాటల సందర్భంలో చెప్పనే చెప్పింది.





## ఎదురుదెబ్బ

వయ్యారిభామ కింశర్మకి టైం బాగా లేనట్టుంది. తాజ్‌మహల్, నెహ్లే పె దెహ్లా సినిమాలో హీరోయిన్‌గా నటించే ఛాన్స్‌లొచ్చినా ఆ సినిమాలు ఇప్పుడప్పుడే ప్రారంభం అయ్యే సూచనలు కనుచూపుమేరలో కన్పించడం లేదు. దీంతో చాలా అసహనంగా ఉన్న కింకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పుడామె ఎక్కడికెళ్లినా ఒంటరిగానే దర్శనమిస్తోంది. కారణం ఏమిటని ఆరాతీస్తే ఆమె చిరకాల బాయ్‌ఫ్రెండ్ ఆమెతో తెగతెంపులు చేసుకున్నాట్ట. ఈమధ్య సంజయ్‌దత్ బర్త్‌డే పార్టీకి ఆమె ఒంటరిగా వెళ్లడం గమనించిన మీడియా ఆ విషయం గురించి అడిగితే ఏ విధమైన జవాబు చెప్పకుండా వెళ్ళిపోయిందిట. ఆమె బాయ్‌ఫ్రెండ్ ప్రశాంత్‌కీ ఆమెకీ మధ్య ఏవో అభిప్రాయ భేదాలు వచ్చాయని సినీ జనం అంతా చెవులు కొరుక్కుంటున్నారు.




పైగా వదిన కొద్దోగొప్పో వడ్డీ వ్యాపారం చేస్తుందని అందరికీ తెలిసిన రహస్యం.

అయినా సరే బీద అరుపులు అరుస్తూనే ఉంటుంది. ఏమిటో మరి.

***

వేసవి సెలవులకి అన్నయ్య రమ్మని రాస్తే పిల్లలిద్దరితో వచ్చింది వసంత. రాజారాం సెలవులు లేవంటూ రాలేదు.

వసంత వచ్చి రెండు వారాలు దాటింది. ఇంకో రెండు రోజుల్లో తిరుగుప్రయాణం పెట్టుకుంది. ఆ విషయమే అదే ఊళ్లో ఉన్న చిన్నాన్నకు పిన్నికి చెప్పి రావాలని బయలుదేరి వెళ్లిందాపూట పిల్లలతో సహా.

పిచ్చాపాటి మాట్లాడుతుంటే భోజనాల వేళ అయ్యింది. అప్పటికే పిన్ని అన్నయ్య ఇంటికి కబురు చేసింది వసంత అక్కడే భోజనం చేస్తుందని.

అక్కడే భోజనం కానిచ్చి కాసేపు అక్కడే నిద్రపోయి సాయంత్రం వేళకి ఇల్లు చేరిన వసంతకి అనుకోకుండా సరళ పక్కింటి పిన్నిగారి దగ్గర తన బాధనంతా వెళ్లబోసుకోవటం వినిపించింది.

"మా ఆడపడుచు ఉంది పిన్ని. వచ్చి రెండు వారాలైంది కదా సోమవారం వెళతానంటుంది. మా అత్తగారు కూతురొచ్చిందని ఏదోక పిండి వంట చెయ్యమంటారు ఎలా కుదురుతుంది చెప్పండి. ధరలసలే మండిపోతున్నాయాయే. అయినా ఏదో ఒకటి చేస్తూనే ఉన్నాను. నా ఒక్క చేతి మీద ఈ పనంతా జరగాలి. మీ అబ్బాయికి ఇవేవీ పట్టవు. టైం టైం అంటూ ఒకటే పరుగులు ఉరకలను. అక్కడెలాగూ నువ్వే చేసుకుంటావుగా అని మా అత్తగారు మా ఆడపడుచును ఇటు పుల్ల అటు తీసి వేయనివ్వరు."

"అలాగైతే కష్టమే" సానుభూతిగా అంది పిన్నిగారు.

"ఇంకా వినండి మరి అత్తగారు పిల్లలకీ, ఆవిడకీ రెండు వేలైనా ఇవ్వాలంటారు ఇప్పుడు బట్టలకి. ఎలా కుదురుతుంది చెప్పండి. మీరు చూస్తూనే ఉన్నారుగా మా ఖర్చులు.

ఎప్పుడూ ఏవో ఖర్చులు, రాబడి ఉన్నా ఏ మూలకవి ఈ ధరవరలతో. మా ఆడపడుచుకో రెండొందలు, పిల్లలిద్దరికీ చెరో వందా ఇద్దాం అంటున్నారాయన. పెట్టాలని ఉన్నా సాగొద్దూ" ఇలా సాగుతున్న సరళ వాగ్ధాటికి ఆనకట్ట పడింది పాలేరు పిలవటంతో.

సంభాషణంతా విన్న వసంత ముఖం వివర్ణమైంది. వదిన దగ్గరికి వెళ్లి నాలుగు దులిపేద్దామా అన్పించింది ఒక్క క్షణం. బలవంతాన నొక్కిపెట్టుకుని ముభావంగా రెండు రోజులు గడిపేసి మూడోరోజు బస్సు ఎక్కేసింది వసంత పిల్లలతో సహా.

వచ్చేస్తుంటే వదిన తన చేతులలో పెట్టిన చీరను తీసుకొని పెట్టెలో పెట్టుకుంటూ-

"కట్టుకుంటే ప్రయాణంలో నలిగిపోతుందిలే వదినా...అసలే అన్నయ్య అంతంత సంపాదనతో కొన్నది కదా" అంది ఉక్రోషంగా.

విననట్టే ఉండిపోయింది సరళ.

***

"చూశారా మా వదిన ఎలాంటి చీర పెట్టిందో. రెండొందలైనా ఉంటుందో లేదో. పిల్లలిద్దరికీ చెరో వందా ఇచ్చారు. ఈ రోజుల్లో వందకేం వస్తాయి. వాళ్లకెలా ఇచ్చినా నాకన్నా మంచి చీర పెట్టవచ్చు కదా!

నాలుగైదు చీరలు మంచి ఖరీదువే కొత్తవి ఉన్నాయి. అందులోది ఒకటి తెచ్చిపెట్టు సరళా అంటూ అమ్మ అంటున్నా విన్పించుకుంటేనా. దగ్గరది అయితే మాత్రం అన్నయ్యకి, అమ్మకి పెట్టాల నుంటే మాత్రం పెట్టనిస్తుందా! మళ్లీ పక్కింటి పిన్నిగారితో ఎంత గోల పెడుతూ చెబుతుందో ఈ ఖర్చులతో ఎలాగండి వేగడం అంటూ..." ఇల్లంతా శుభ్రం చేసుకుంటూనే అప్పుడే ఆఫీసు నుంచి వచ్చిన భర్తతో తన అక్కసంతా వెళ్లబోసుకుంది వసంత.

"పోనీలే వసంతా. ఏదో వాళ్లు కలిగున్నంతలో పెట్టారు వాళ్ల ఖర్చులు వాళ్లకుంటాయిగా."

రాధిక వెళ్లేటప్పుడు భార్య ప్రవర్తించిన తీరు గుర్తుకు వచ్చింది రాజారాంకి.

"ఆ ఏమిటండీ ఖర్చులు...వాళ్లు కొనుక్కునేటప్పుడు ఏ ఖర్చులు గుర్తుకు రావు. ఆడపడుచులకు పెట్టాలంటేనే బాధంతాను. పుట్టింటి వాళ్లకైతే సంతోషంగా పెడుతుంది. రోజురోజూ పెట్టమంటామా. నెలకొకటి పెట్టమంటామా."

"అవును ఆడపడుచుకు పెట్టాలంటేనే బాధ అందరికీని. పెట్టే ప్రతి వదిన తాను ఒకరికి ఆడపడుచునని మర్చిపోతుంటుందేమో. నువ్వూ ఒకరికి వదినవేగా. ఇది నీకూ వర్తిస్తుంది వసంతా... మీ అన్న వదినలననటం ఎందుకు?"

రాజారాం నవ్వుతూనే అంటించాడు.

భర్త మాటలు చురుక్కుమనగా వసంత మరి మాట్లాడలేకపోయింది.

★